
నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రంభీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 17 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



## మట్టిని అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

చెన్నూర్ మండలంలోని ఇటుక బట్టి వ్యాపారి మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ఒక్కదానికే అనుమతులు ఉన్నాయి. ప్రస్తుతం బావురావుపేట గ్రామంలో తప్ప మండలంలో ఎక్కడా మట్టి తవ్వకాలకు అనుమతులు లేవు. మట్టి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రంగా మట్టిని రవాణా చేస్తూ పట్టుబడితే జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేస్తాం.

- మల్లికార్జున్, తహసీల్దార్, చెన్నూర్.





చెన్నూర్ మండలంలోని ఎర్రగుంటపల్లిలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

# మంత్రి ఇలాకాలో

# మైనింగ్ మాఫియా

## వివేక్ సొంత నియోజకవర్గంలో మట్టి, ఇసుక దందా

- అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతానన్న మంత్రి వివేక్
- చెన్నూర్‌లోని పలు గ్రామాల నుంచి తరలిపోతున్న మట్టి
- సుద్దాల వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు
- ట్రాక్టర్లు, జేసీబీలతో యథేచ్ఛగా రవాణా
- దందా చేస్తున్న వారిలో అధికంగా హస్తం లీడర్లే..
- మంత్రి చెప్పినదానికి, స్థానిక లీడర్లు చేస్తున్న దానికి సంబంధమే లేదు

*"రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా నడుస్తున్న ఇసుక, మట్టి రవాణాపై ఉక్కుపాదం మోపుతా.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెంచగలననే నమ్మకంతో సీఎం రేవంత్‌రెడ్డి నాకు మైనింగ్‌శాఖ అప్పగించారు. ప్రభుత్వ ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేస్తా. చెన్నూర్ నియోజకవర్గంలో ఇసుక మాఫియా, భూ దందాలు అన్ని ఇప్పటికే బంద్ అయ్యాయి. ఇకపై రాష్ట్రంలోనూ అన్ని బంద్ అవుతాయి." అంటూ కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ ప్రకటించారు. మంత్రి అయ్యాక తొలిసారి చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌ల్లో ఈ విషయాన్ని పదేపదే స్పష్టం చేశారు. కాకపోతే మంత్రి చెప్పినదానికి విరుద్ధంగా ఆయన సొంత నియోజకవర్గమైన చెన్నూర్‌లోనూ మట్టి, ఇసుక దందా జోరుగా సాగుతున్నది. చెన్నూర్, జైపూర్, భీమారం మండలాల్లో మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు ట్రాక్టర్లు, జేసీబీల సాయంతో రాత్రికి రాత్రే ఇసుక, మట్టిని తరలిస్తుంటే అధికారులు చోద్యం చూడడం తప్ప ఏం చేయలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోట్ల అధికారులు ఈ మాఫియాకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు మామూళ్ల మత్తులో పడి అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి.*

*- మంచిర్యాల, జూన్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### జోరుగా మట్టి దందా

- చెన్నూర్ మండలంలోని కొమ్మెర, ఎర్రగుంటపల్లి, ఆస్నాద్, నాగాపూర్, సోమన్‌పల్లి గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. చెరువులు, పొలాల్లో మట్టి తీసి యథేచ్ఛగా ప్రైవేటుగా విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు ట్రాక్టర్‌లోడ్‌కు డబ్బులు తీసుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇప్పటికీ మట్టి దందా జోరుగా సాగుతున్నది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఈ గ్రామాల్లో మట్టి ట్రాక్టర్లు నడిచినట్లు స్థానికులు చెప్తున్నారు.
- జైపూర్ మండలంలోని రామారావు పేట, ఇందారం గ్రామాల్లో మట్టి దందా నిత్యకృత్యంగా మారింది. మంచిర్యాల జిల్లా ఇందారం నుంచి విజయవాడ వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే 163–జీ పనుల కోసమని తీసుకున్న పర్మిషన్‌తో మట్టి రవాణా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నేషనల్ హైవే కోసమని అధికారులు రామారావుపేటలో మట్టి తీసేందుకు అనుమతిస్తే ఆ కాపీ చూపించి మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ అండదండలతో అధికారులను మేనేజ్ చేస్తూ చెన్నూర్ నియోజకవర్గంలో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. అధికారులు నిఘా పెడితే ఒక్కరోజులోనే వందల ట్రాక్టర్లను పట్టుకోవచ్చని స్థానికులు చెప్తున్నారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ట్రాక్టర్ల గోల భరించలేకపోతున్నామంటూ పలువురు వాపోతున్నారు.

### అక్రమంగా ఇసుక రవాణా

- చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంగా ఇసుక రవాణా జోరుగా నడుస్తున్నది. ప్రభుత్వ పనుల కోసమని అనుమతి తీసుకుని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.
- జైపూర్ మండలంలోని వేలాల–కిష్టాపూర్ క్వారీ నుంచి ఈ తరహాలోనే ఇసుక మాఫియా నడుస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక లీడర్లే కాకుండా మంత్రి వివేక్‌తోపాటు మంత్రివర్గంలో చేరిన మరోనేత పీఏగా చెప్పుకునే ఓ వ్యక్తి ఇసుకతోపాటు మట్టి అక్రమ రవాణాలో కీలక పాత్రదారిగా ఉన్నట్లు సమాచారం. ఇదే కాకుండా జైపూర్ మండలంలోని ఇందారం, చెన్నూర్ రూరల్ మండలంలోని గోదావరి నుంచి ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక అక్రమంగా తరలిపోతున్నది.
- చెన్నూర్ మండలంలోని సుద్దాల వాగు నుంచి నిత్యం పలు గ్రామాలకు అక్రమంగా ఇసుక రవాణా సాగుతుంది. కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు రోజు ఇసుక దందా నడిపిస్తున్నాడు. ఇప్పటికీ మూడు సార్లు ఇసుక రవాణా చేస్తూ ఆ నాయకుడి ట్రాక్టర్ పట్టుబడింది. చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇదే కాంగ్రెస్ నాయకుడి ట్రాక్టర్ ఇసుక లోడ్‌తో మరోసారి పట్టుబడింది. సదరు నాయకుడి ట్రాక్టర్ అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడడం ఇది నాలుగోసారి అని సీఐ తెలిపారు. ఆ ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇప్పటికీ ఆ ట్రాక్టర్ పోలీస్ స్టేషన్‌లోనే ఉంది. కిష్టంపేట్‌లో ఈ కాంగ్రెస్ లీడర్‌తోపాటు, ఆస్నాద్ గ్రామంలో జేసీబీ ఉన్న ఓ కాంగ్రెస్ లీడర్ ఇసుక దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. గోదావరి, స్థానిక వాగుల నుంచి ఇసుక తీసి ఒక్కో ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.2500 నుంచి రూ.3వేలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.
- భీమారం మండలంలోని పెద్దవాగు నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్లలో పలువురు ఇసుకను తరలిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు లీడర్లే ఈ అక్రమ ఇసుక రవాణా వెనుక ఉన్నట్లు తెలుస్తున్నది. ఇతర పార్టీలకు చెందిన ఒకరిద్దరు నాయకులను కూడ బలుక్కుని ఇసుక రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఇసుకతో పట్టుబడిన ఓ కాంగ్రెస్ నాయకుడి ట్రాక్టర్

మంత్రి వివేక్ చెప్పిన మాటలకు కట్టుబడి నియోజకవర్గంలో ఇసుకను అక్రమంగా రవాణా చేయకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై మంత్రి, అధికారులు ఎలా స్పందిస్తారు అన్నది వేచి చూడాలి.





ఆటోలతో ర్యాలీగా మంచిర్యాల కలెక్టరేట్‌కు వస్తున్న ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు

## న్యాయం చేయాలి

### మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల ధర్నా

*ఆటో యూనియన్‌కు కేటాయించిన స్థలాన్ని బెల్లంపల్లి ఆర్డీవో ఇతర సంస్థకు కేటాయించడాన్ని నిరసిస్తూ ఆ సంఘం నాయకులు, ఆటో డ్రైవర్లు సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తమకు న్యాయం చేయాలంటూ బెల్లంపల్లి నుంచి ఆటోలతో ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో స్టాండ్‌కు కేటాయించిన స్థలాన్ని, తాము నిర్మించుకున్న సమావేశం గదిని కొంత మంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతి పత్రం అందజేశారు. పెద్ద సంఖ్యలో ఆటోలతో ర్యాలీగా తరలిరావడంతో మంచిర్యాల పట్టణ వాసులు ఆసక్తిగా చూశారు.*

*- నమస్తే తెలంగాణ మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్/ నస్పూర్, జూన్ 16*





మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

## ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

- మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదు
- సింగరేణి అన్ని విభాగాల హెచ్‌వోడీలకు సీఎండీ బలరాం హెచ్చరిక

శ్రీరాంపూర్, జూన్ 16 : సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేది లేదని సీఎండీ ఎన్ బలరామ్ వివిధ విభాగాల అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన సోలార్ విద్యుత్, పవన విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, జియో థర్మల్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, కీలక ఖనిజాల ఉత్పత్తి, జాయింట్ వెంచర్ల ఏర్పాటు, కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర 28 రకాల ప్రాజెక్టులు, పనులపై సీఎండీ సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనకు రావడం, కొన్ని పనులపై ఒప్పందాలు కుదుర్చుకున్నారని, మరికొన్ని పనులపై ఏజెన్సీల ద్వారా అధ్యయనం చేస్తామని చెప్పారు. సింగరేణి సంస్థకు ఈ వ్యాపార విస్తరణ చర్యలు ఎంతో అవసరమని, ఈ పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలని కోరారు. వివిధ విభాగాల అధికారులు తమకు కేటాయించిన పనులపై వివరించగా ఆయన పనుల్లో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరో 10 రోజులకల్లా ప్రతి పనిలో ప్రగతి కనిపించాలన్నారు. ఇకపై ప్రతి వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలపై సానుకూల ధోరణితో ఉన్నాయని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యాపార విస్తరణ చర్యలు త్వరగా అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు కార్యాలయాలు, క్వార్టర్ల పైన చేపట్టాల్సిన రూఫ్ టాప్ సోలార్ పవర్ గురించి, కోల్ వాషరీల ఏర్పాటు, హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై లోతుగా చర్చించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ ఈఅండ్‌ఎం డీ.సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్లు ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కే వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ సుభాని, జీఎం సీపీపీ ఎ.మనోహర్, జీఎం మార్కెటింగ్ ఎన్‌వీ రాజశేఖర్‌రావు, సింగరేణి థర్మల్ పవర్, సోలార్ పవర్, రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, సింగరేణి సివిల్, బిజినెస్ డెవలప్ మెంట్, తదితర 20 శాఖల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

### దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

నస్పూర్, జూన్ 16 : ప్రతి ఒక్కరూ తమదైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీలు, దవాఖానల్లో కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఆయుష్ శాఖ వైద్యాధికారి పద్మజ, వైద్యాధికారులు మేఘ, కృపాబాయి, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు



చెన్నూర్ కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## అక్రమ కేసులకు భయపడేది లేదు

- ప్రశ్నిస్తే కేసులు పెడుతారా ?
- భీమారం మండల బీఆర్ఎస్ నాయకులు

భీమారం, జూన్ 16 : ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రశ్నించినందుకు మంత్రి వివేక్ పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని భీమారం మండల బీఆర్ఎస్ నాయకులు చింతం తిరుపతి, దాసరి మణిదీపక్, బబ్లూ, గుడిమల్ల నరహరి, రాజన్న, డోంగ్రి రాజలింగు, వడ్ల కొండ పవన్ మాదిగ, రమేశ్ గుడిమల్ల నరహరి అన్నారు. సోమవారం వారిపై నమోదైన కేసుల విషయంపై చెన్నూర్ కోర్టుకు హాజరయ్యారు. భీమారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే వివేక్‌ను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకులపై, సోషల్ మీడియా వారియర్స్‌పై కేసులు నమోదు పెట్టడం సిగ్గుచేటని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ చెప్పిన ఆరు గ్యారెంటీలు, వివేక్ వెంకటస్వామి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకూ ప్రజల పక్షానా పోరాడుతామని స్పష్టం చేశారు.